
# శ్రీ కాళీపట్నం రామారావు

మాస్టారు అరవయ్యోపడిలో ప్రవేశిస్తున్నారు- మీరేమయినా నాలుగు ముక్కలు మీ నోటికి తోచినవనండి- అంటే కొందరు పెద్దలు ఏమనవచ్చు అంటే-



కాళీపట్నం రామా
రావ్ చేసిన కథా భీమా
ఆజన్మాంతమూ సరిపోతుందనే ధీమా
తో రాతకు పుల్ స్టాపించడం సక్రమమా!
రామారావ్ పట్నం కాళీ
తయారించిన యజ్ఞం గోళీ
రచయితల కిచ్చింది సరికొత్త పాళీ
విమర్శకుల్ని చేసింది పూర్తిగా మోళీ-

అని ఓ మహాకవి అంటే-

అతని కథలలో అనంతానుభవపు
వాడి గాథలు కలవు! నివాస హీన
కర్షకావళీ జీవనగాథ వేదనాగ్ని వాహిని
ప్లుష్ట సమాజఛాయ- లందు నెడనెడగలవు!
నిరంతరము శ్రమైక జీవనులై-
హృదయాంతరంగ ప్రేమ వేదనోన్మాదముల్-
పేరెరుగక వసియించెడువారి వాస్తవ సుహాసభాషణల్
వానిలో వినబడుచుండు!
ఎప్పుడవుదూప భావనోత్తేజ మెసగు
విప్లవాలోకనాలోక వీధులవియె;

అని మరో మధురకవి అనవచ్చు!

ఇది యజ్ఞం సంగతి. ఇదంతా చెలం గొడవకాదు. ఇష్టం లేనివాళ్ళు

# పేరడీ వినిన వార్త.

యీపేరా వదిలేసి (దీంట్లో మీ సెక్సుని ఉద్రేకించే సంగతులు ఏమీలేవు) రామారావు భావాల్లో కురకండి. అప్పల్రావుడి వాదనలో, సీతారాముడి వేదనలో ఊపిరాడక, దారిదొరకక మనం నమ్మిన సమాజపు అభివృద్ధి అంతా యింత బోగస్సని తెలిసాక, గాంధీ సుభాషితాలూ నెహ్రూ ప్రణాళికలూ హంబక్ హంబక్ హంబక్ అని గ్రహింపయాక, యీ పుస్తకాలనుంచి పొలాల్లోకి పొలాలనుంచి అడవుల్లోకి పదండి ముంధుకు పదండంటూ పరుగెత్త చూస్తారు!—

అని ఓ పెద్దమనిషి కితాబు నిస్తే—

నా చిన్నప్పుడు మా వూరి బళ్ళో ఓ అయ్యవారుండేవారు.

మనలో మనమాట— ఏ అయ్యవారూ లేకపోతే నేనిక్కడ యిలా రాయటం కుదరేదే కాదు. మీరిది చదవటమూ కుదిరేదే కాదు. చదువురాని వాడవనీ దిగులు చెందకూ- అని ఎవరో మాట వరసకు అనేసినా మనం చదవబట్టే కదా- యీకథల్లో మనం యిలా కలుసుకోడం జరుగుతున్నది.

అయ్యవార్లందీ బెత్తాలే గుర్తు రానివ్వండీ అక్షరాలే గుర్తురానివ్వండీ కథల్లోకి వస్తే మాత్రం మన పిలక పట్టుకుని కూర్చోబెట్టి మనకి తెలిసిన మంచిలో చెడ్డేమిటో చెడ్డలో మంచేమిటో ఆమూలాగ్రంగా చెప్పే రామారావు మాస్టారే గుర్తు వస్తారు.

కథల కడలిలో లేచిన కొత్త తరంగం— అని వూరకే అన్నారా మా వారు.

అంటూ మరో యిల్లాలు ముచ్చటించవచ్చు.

*కథకులనుబట్టి ప్రతికథా మధురమగును*
*ధ్యేయమునుబట్టి కథకుడు దివ్యుడగును-*

అని ఓ ప్రఖ్యాత కవి గజలించితే

*బెత్తము చేతిలోది! ఝళిపించుట పిల్లలనో, సమాజ సం*
*పత్తిని మింగు పెద్దలనో! వ్యక్తి కథాటవిలో సమాజమున్.*
*విత్తుట చేతనో! యెదురు వీడిన పాత్రల నెత్తినందుకో!*
*మొత్తము మీద కొత్తదనమున్ కథ కెత్తితివోయి రామయా!*

అని మరో ప్రఖ్యాత కవి మెచ్చువచ్చు!

*అనుకోకే పోవాలిగాని, సునిశిత పరిశీలనా సూక్ష్మవివరణా నిత్య ప్రసన్నాలు మా కాళీపట్నానికి.*

*స్ఫురణ, ప్రతిభ సహజాతం కొందరికే.*

కాక — మనిషి అయినవాడికి - ఆత్మ విశ్వాసం ఉంటే- పరిశ్రమ ఉంటే- యెంతో వుపకారం చేస్తుంది ప్రవృత్తి.

ఆ విద్య సాధించటంలో ఆ మనిషి చూపించిన పరాకాష్ట తానెందుకు చూపించ గూడదూ!

ఇలాంటి వూహ అందరికీ వుండవు, నిజమే.

ఇలాంటి కనీ అందరికీ వుండదు, సత్యమే.

ఉండినా, చివరిదాకా నిలవనూ నిలవవు కొందరికి.

నిలిచాయా, మా కాళీపట్నంలా కోటలో పాగా వేశారన్నమాటే—

అంటూ ఓ ఖద్దరు వ్యతిరేకి అభిప్రాయపడితే—

షష్టిపూర్తి యన అరువదియేండ్లు పూర్తగుట. కధకులకూ షష్టిపూర్తి యగుట కలదు. ఆయన కధకుడు— కధకునికి అనుభవములుండును. అనుభూతు లుండును. స్వీయానుభవమును అందించువాడు ఉత్తమ కధకుడు. స్వీయానుభూతిని అందించువాడు ఉత్తమకవి. అనుభూతినందించు కధకులూ కలరు. అనుభవమునందించు కవులునూగలరు. కాని యొకభేదమున్నది. అదియే కవితారీతి. అదియే కధన రీతి. రీతిని చిన్నచూపు చూచువారు గలరు వారికి కాళీపట్నం నచ్చును. నచ్చినదేరీతి యని వారు వాదించుట కలదు. కాని రీతి రీతియే యగును. వాదన వాదనయే యగును.

అంటో ఓ సనాతనవాది అభిప్రాయపడవచ్చును.

కాళీపట్నం రామారావు-

మనవాడు!

ఊహుఁ మనలో వాడు!

ఎప్పుడయాడు?- ఎందుకయాడు?-

రాసాడట-!

రాయడం అందరూ రాసినట్టే కలంతోనే రాసాడు!

ఏం రాసాడు, శాంతి ఆర్తి!-


శాంతి ఎవరికవసరమో రాసాడు- ఆర్తి ఎవరిదో రాసాడు-

అప్పుడయాడు— మనవాడు

అందుకయాడు- మనలోవాడు

అంటూ ఓ శాస్త్రిగారు డు, ము, వు, లు చెపితే—

ఫలానా మనిషిగురించి రెండు మాటలు చెప్పూ— అంటే నాకాట్టే టయింపట్టదు. వెంటనే చెప్పేస్తానా అన్నది వేరేమాట. రామారావు మాస్టారిగారి గురించి చెప్పమంటే, కధకుడిగా ఆయన సాహిత్యం మంచిచెడ్డల గురించి చెప్పాల్సి వుంటుందనీ. మనిషిగా ఆయన మంచిచెడ్డల గూర్చి చెప్పాల్సివున్నదనీ చెప్పవచ్చునేమో? సాహిత్యం మొత్తంగా ఎవరో ఒకరి మంచికి పాటుపడుతుందని మనం సులువుగా నమ్మవచ్చు.



**కాప్షన్‌లెస్ కార్టూన్ల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కార్టూన్**

నేను సృష్టిస్తున్న సాహిత్యం, ఎవరి మంచికయితే నిలబడాలని నేను అనుకుంటానో, వారి మంచికోసమే మాస్టారి సాహిత్యమూ పాటుపడుతుందనే. మీకు లాగే నేనూ స్పష్టంగా నమ్ముతున్నాను.

ఇంతకీ నేను చెప్పేదేమిటంటే : మనం రాస్తున్నది మనకి నచ్చడం మానవ సహజం.

పోతే—

నాకు మంచి కబుర్లు చెప్పేవాళ్ళకన్నా మంచిపనులు చేసే వాళ్ళంటే మరీ యిష్టం.

అందుచేతనే—

మాస్టారంటే నాకు యిష్టం, గౌరవం, భయం

షరా : భయానికీ, మంచికీ పొందిక లేదు. పిరికివారెవరూ కూడా మంచివారు కాజాలరు, మంచికి నిలబడలేరు. ఇందుకు ఎంతో గారంటీ ఉంది.

మంచిగా ఉండాలంటే గుండె నిబ్బరం చాలా ఉండాలి.

*అంటూ మరో శాస్త్రిగారు సారాంశం చెప్పవచ్చు.*

చాలామందికి నచ్చేలా రాసేవాళ్ళు చాలామంది ఉంటారు. ఎందువల్లనో సమాజం వాళ్ళనీ వాళ్ళ రచనలనీ తొందరగా మర్చిపోతుంది. కొద్దిమందికయినా మార్చేలా రాసేవాళ్ళు కొద్దిమందే ఉంటారు. వాళ్ళు చాలాకాలం మిగుల్తారని చాలా దాఖలాలు చూపించవచ్చు. ఆధునిక సాహిత్యంలో నాలుగు కాలాలపాటు నిలబడే రచనకు విధిగా ఓ లక్షణముంటుందని దీన్నిబట్టి గ్రహించవచ్చు. ప్రజల అభిరుచుల మేరకుగాక ప్రజల ప్రయోజనాల మేరకు రచన స్వరూప స్వభావాలు ఉంక

టమే ఆ లక్షణం.

అలాంటి లక్షణం పుష్కలంగా గల రచనలు చేసినవారిలో రామారావుగారు ఒకరు.

*అంటూ సాహితీ కులపతి సూత్రీకరించితే -*

62లో 'నేనెందుకు రాసానో' సమీక్షించుకుంటూ ఎందుకు రాయటం మానేసానో చెప్పుకున్నాను. 72 లో జనాన్ని విడిచి వ్యక్తుల గురించి రాయడాన్కి నాకు మనస్కరించదని సంజాయిషీ యిచ్చుకుంటూ చెప్పాను....

పోతే—

ఈ పన్నెండేళ్ళుగా ఎందుకు రాయలేదు.

-అందే ఇప్పుడు కూడా అంత చప్పున జవాబిచ్చుకోలేను.

అందుకు కారణాలు లోగడ యిచ్చుకున్నవే అయినా, మరికొన్ని కారణాలు వేరే అవుపిస్తున్నాయి.

నేడు సాహిత్యం మారింది. సంపాదకులు బాధ్యతలు (లాంగ్వలిటీస్) మారాయి. పాఠకుల అభిరుచులు మారాయి. యిప్పుడు ప్రజాసంబంధమైన ఏ కళా రూపానికయినా వేగం ప్రధానలక్షణం.

యిప్పుడు నేనేం చెప్పాలన్నా వేగాన్ని పట్టుకోవాలి. అదో సమస్య.

అంతే కాక—

నే నెప్పుడు ఏం రాసినా మారుతూనే రాసాను ఎప్పుడు మానేసినా ఎలా మారటమో తెలియకే మానేసాను.

కాదంటే—

నేను మార్పుచెందే సామర్థ్యాన్ని కోల్పోయానా- అన్నది నన్నిప్పుడు పీడిస్తున్న సమస్య.

ఆ సమస్య నుంచి నేను బయట పడాలి.

అందాకా- నేను రాయలేను.

*అంటూ మాస్టారే స్వయంగా సంజాయిషీ యిచ్చుకోవచ్చు. ఇంతవరకూ ఇన్ని వాగిన నన్ను మాస్టారి గురించి మాట్లాడమంటే...*

సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులయిన వారి గొంతులనూ, పద్ధతులనూ, శీర్షికలనూ అనుకరిస్తూ సర్కస్ ఫీట్లు చేసిన నేను- (వారి రాతలలో వాక్యాలకు వాక్యాలే ఎరువు తెచ్చుకున్న నేను)- ఇందులోని పొరపాటు అభిప్రాయాలూ పొగడ్తలూ నావేననీ ఆయా పెద్దలకెలాంటి సంబంధమూ లేదనీ చెంపలు వేసుకుంటూ- నా మెదడుకు పదును పెట్టిన మాస్టారి వ్యక్తిత్వానికి ఓ నమస్కారం పెట్టడం తప్ప- ఏం మాట్లాడగలను—?

——— వివిన మూర్తి